పాడి పరిశ్రమ పెంపునకు కృషి

- పశువులను కాపాడుకోవడం మన బాధ్యత
- గాలి కుంటు వ్యాధి టీకాలో జిల్లా ప్రథమ స్థానం
- రాయితీ కింద జొన్న, మొక్కజొన్న దానా పంపిణీ
- ప్రతి ఒక్కరూ పశువులకు బీమా చేయించాలి
- ప్రజాశక్తితో పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ గుడివాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

దేశానికి వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కూడా అవసరమని, అలాంటి పాడి పరిశ్రమ పెంపునకు కృషి చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గుడివాడ శ్రీనివాస్ అన్నారు. పశువులను పెంపొంచడం మన బాధ్యతని, పశు పోషణ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పశువులకు వచ్చే ఎలాంటి రోగాలకు అయిన వైద్యాన్ని అందించడానికి ప్రభుత్వం అన్ని సహకారాలు అందిస్తోందని..టోల్ ఫ్రీ నంబర్ 1962కు కాల్ చేస్తే ఇంటివద్దకే అంబులెన్స్ వచ్చి పశువులకు వైద్యం అందిస్తుందని వెల్లడించారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో ఆవులు,గేదెలు,ఎన్ని ఉన్నాయి?

జెడి : జిల్లాలో ఆవులు అంటే తెల్లజాతి పశువులు ఎద్దులు, ఆవులు, దూడలు, 2,35,586, గేదెలు 1,26,784, మేకలు, గొర్రెలు 14 లక్షల దాకా, కోళ్లు 6 లక్షల దాకా ఉన్నాయి.

పశువుల వైద్యాన్ని ఎలా అందిస్తున్నారు?

జెడి : జిల్లాలో పశువులకు చాలా అనారోగ్యాలు వస్తున్నాయి. ముఖ్యంగా గాలికుంటు వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాధి వల్ల చాలా పశువుల ప్రాణాలు పోతున్నాయి. జిల్లాలో ఆగస్టు 20 నుండి సెప్టెంబర్ 18 వరకు గాలికుంటు వ్యాధుల టీకా కార్యక్రమం ఉంది.

గాలికుంటు వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జెడి : జిల్లాలో గాలికుంటు వ్యాధులకు 3,25,000 టీకాలు టార్గెట్ గా తీసుకున్నాం. అందులో భాగంగా ఇప్పటికి 70 శాతం టీకాలు పూర్తి చేశాం. రాష్టంలో అత్యధిక టీకాలు వేసిన వాటిలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది.

పశువులకు ఎలాంటి వ్యాధులు సంభవిస్తున్నాయి?

జెడి : పశువులకు బ్రుసెల్లా వ్యాధి రాకుండా 8 నెలల వయసున్న ఆవు దూడలకు 8వేల వ్యాక్సిన్‌లు వేయాలి. ఇప్పటికి 6వేల వ్యాక్సిన్ లు వేయడం జరిగింది. అలాగే పశువులకు పారుడు రోగం (పీపీఆర్) గేదెల్లో వస్తుంది. ఆ రోగాన్ని ముందుగా గుర్తించి వ్యాక్సిన్‌లు మొదలు పెట్టాం. రైతులు అప్రమత్తంగా ఉండి పశువుల ప్రాణాలు కాపాడాలి.

పాడి రైతులకు గోకులాలు నిర్మాణం ఎంతవరకు వచ్చింది?

జెడి : జిల్లాలో రైతులకు 1200 నూతన గోకులాలు కట్టించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రైతుల నుండి దరఖాస్తులు తీసుకున్నాం. వాటికి 90 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తుంది. 10 శాతం రైతు వాటా ఉంటుంది. త్వరలో నిర్మాణం డ్వామా ద్వారా చేపడతాం.

పశువులకు పశుగ్రాసం అందిస్తున్నారా?

జెడి: జిల్లాలో హైబ్రిడ్ మొక్క జొన్న 10 టన్నులు,హైబ్రిడ్ జొన్న 10 టన్నులు పశుగ్రాసం, దానా ఒక రైతుకు 25 కేజీల చొప్పున అందిస్తున్నాం. కావలిసిన రైతులు తీసుకోవచ్చు.

పశువులకు బీమా సౌకర్యం ఉందా?

జెడి : జిల్లాలో పశువులకు బీమా ప్రభుత్వ వాటాగా రూ.11 లక్షలు మంజూరు చేసింది. దాదాపు 70 శాతం బీమా పూర్తి చేశాము. ప్రతి రైతు కూడా పశువులకు బీమా చేయించాలి. జిల్లాలో ఇప్పటిదాకా మృతి చెందిన పశువులకు మొత్తం బీమా చెల్లించాం.

పశులకు సేవలు ఎలా అందిస్తున్నారు?

జెడి : జిల్లాలో అన్ని పశువుల ఆసుపత్రులలో వైద్యాన్ని అందిస్తున్నాం. అలాగే టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేస్తే ఉచిత పశువుల అంబులెన్స్ ఇంటివద్దకే వచ్చి వైద్యాన్ని అందిస్తుంది. ఈ సేవలను పాడి రైతులు ఉపయోగించుకోవాలి.

జిల్లాలో శిథిలావస్థకు చేరిన పశుసంవర్ధక శాఖ భవనాలు ఎన్ని ఉన్నాయి. వాటి పరిస్థితి ఎలా వుంది?

జెడి : జిల్లాలో మొత్తం 153 భవనాలు ఉన్నాయి. అందులో 25 భవనాల దాకా శిథిలావస్థకు చేరాయి. వాటి వివరాలు ఉన్నతాధికారులకి నివేదించాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

డాక్టర్లు అందుబాటులో లేరు..గోపాల మిత్రల ద్వారా వైద్యం అందిస్తున్నారు అనే ఆరోపణలు ఉన్నాయి...?

జెడి : అలా ఎప్పుడూ జరగదు. డాక్టర్లు అందరూ పశువైద్య శాలలో సేవలు అందిస్తున్నారు. ఉచిత అంబులెన్స్‌లలో కూడా డాక్టర్లు వెళ్తున్నారు. అలాంటి ఫిర్యాదులు ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. డాక్టర్లు అందరూ సేవల్లో ఉన్నారు.

కృత్రిమ గర్భధారణ ఎలా నిర్వహిస్తున్నారు?

జెడి : జిల్లాలో ఏప్రిల్ నుండి జూలై దాకా 19,589 శాంపిల్స్‌ను తీసాము. టార్గెట్‌కు అనుగుణంగా సిబ్బంది అందరూ సేకరిస్తున్నారు. ఇది భారత్ పశు సదన్ యాప్‌లో ఎప్పటికపుడు నమోదు చేయాలి.

పాడి రైతులకు మీరు ఇచ్చే సలహాలు..సూచనలు..?

జెడి: జిల్లాలో ఉండే పాడి రైతులు పశువుల ప్రాణాలు కాపాడాలి. ప్రతి ఒక్కరు బీమా చేయించండి. పశు పోషణ పెంచేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. టీకాలు వేయించాలి. రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. ఎలాంటి సేవలు అయినా అందించడానికి డాక్టర్లు, పశుసంవర్ధక శాఖ సేవలు అందిస్తుందని కోరుతున్నాం.

వైద్యం కోసం వస్తే..

ప్రాణాలు తీస్తున్నారు..

- ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రాణాలతో చెలగాటం
- దండుకోవడమే లక్ష్యంగా వైద్యం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రోగులకు ప్రాణాలు పోయాల్సిన ఆస్పత్రుల్లో ప్రాణాలను తీస్తున్నారు. ఆసత్రిలో చేరినప్పటి నుంచి దండుకోవడమే లక్ష్యంగా వైద్యం అందిస్తున్నారు. ఎలాగైనా బతికించండయ్యా అనే రోగుల కుటుంబ సభ్యుల ఆవేదనను పట్టించుకోకుండా కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల కర్నూలు నగరంలో చోటు చేసుకున్న ఘటనలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రయివేటు ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

వైద్య సేవలకు కర్నూలు పెట్టింది పేరు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి కూడా వైద్య సేవల కోసం అనేక మంది కర్నూలుకు వస్తుంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 130 ప్రయివేటు ఆస్పత్రులు ఉన్నాయి. కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్యం కోసం వచ్చిన వారి నుంచి డబ్బే పరమాధిగా లక్షలకు లక్షలు దండుకుంటూ వైద్యం పేరుతో దోచుకుంటున్నారు. ప్రయివేటు ఆస్పత్రులంటేనే రోగులు భయపడుతున్నారు. డబ్బు కన్నా ప్రాణాలు ముఖ్యం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కడెక్కడి నుంచో వచ్చి కర్నూలు నగరంలోని ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కొన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లో వైద్యం పేరుతో లక్షలు దండుకుంటున్నా రోగుల ప్రాణాలు మాత్రం దక్కడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నారు. గతంలో కర్నూలు నగరంలోని ఒక ప్రయివేటు నర్సింగ్ హోంలో తెలంగాణకు చెందిన ఓ యువతి చికిత్స కోసం వెళ్లింది. వైద్యుల నిర్లక్ష్యంతో సరైన వైద్యం అందక మృతి చెందింది. ఆ యువతి బంధువులు ఆందోళనకు దిగడంతో ఆ నర్సింగ్ హోం యాజమాన్యం ఆ యువతి కుటుంబ సభ్యులకు కొంత డబ్బును ఇచ్చి చేతులు దులుపుకుంది. ఇటీవల కర్నూలు నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ప్రకాశం జిల్లా కోమరోలు మండలానికి చెందిన ఆరేళ్ల బాలికను డెంగీ లక్షణాలతో చేర్పించారు. తొలుత నంద్యాలకు తీసుకువెళ్లగా అక్కడి నుంచి కర్నూలులోని ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. డెంగీకి ఆరోగ్యశ్రీ వర్తింపజేసే అవకాశం ఉన్నా లక్షలు వసూలు చేశారు. రూ.3.20 లక్షలు ఖర్చు చేసుకున్న ఆ బాలిక కుటుంబ సభ్యులకు చివరికి మృతదేహాన్ని అప్పగించారు. ఇంటి వద్ద ఉన్న పశువులను అమ్మి తమ బిడ్డ వైద్యం కోసం కడితే మృతదేహాన్ని అప్పగించారని బాలిక కుటుంబ సభ్యులు మృతదేహంతో ఆ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రి యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా కర్నూలు నగరంలో ఠాగూర్ సినిమాలో లాగా మృతదేహానికి ఆక్సిజన్ పెట్టి, చికిత్స అందించి లక్షల బిల్లులు వసూలు చేస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఆ ఘటనలు బయటకు రాకపోతే వైద్యం పేరుతో లక్షలు దోచేస్తున్నాయి కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు. వైద్యుల, ఆస్పత్రి యాజమాన్యాల నిర్లక్ష్యం బయటకు పొక్కి రోగుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగితే ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

ఆర్ఎంపిలకు కమీషన్లు..

ప్రయివేటు ఆస్పత్రులకు వచ్చే కేసుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపి డాక్టర్ల వద్ద నుంచే వస్తున్నాయి. గ్రామాల్లో పేరు గాంచిన ఆర్ఎంపి డాక్టర్లతో ప్రయివేటు ఆస్పత్రులు ముందుగా డీల్ కుదుర్చుకుంటాయి. వైద్యం కోసం తమ ఆస్పత్రికి పంపినందుకు కొంత కమీషన్‌ను కూడా ఆర్ఎంపిలకు ముట్టజెబుతున్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో లక్షలు దండుకుంటున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు కూడా ప్రయివేటు ఆస్పత్రుల నుంచి వాటాలు అందుతున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది.

యుద్ధాలు వద్దు - శాంతి కావాలి

- అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా న్యూ సిటీ సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో యుద్ధాలు వద్దు శాంతి కావాలని, అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించండి అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర నాయకులు పి. నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు కె.ప్రభాకర్, నగర నాయకులు టి.రాముడు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ పాలస్తీనాలో ఉక్రెయిన్లోయుద్ధాలను అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం రెచ్చగొడుతూ ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసి పిల్లలు ,పెద్దలు తేడా లేకుండా జనావాసాల పైన దాడులు చేసి 40,000 మంది పాలస్తీనా ప్రజల ప్రాణాలను బలి కొన్నదన్నారు. పాలస్తీనా ప్రజలు తిండి దొరకక ,చిన్న పిల్లలకు పాలు దొరకక మందుల కొరతతో నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికి కారణం అమెరికా అన్నారు. ఉక్రెయిన్ దేశానికి నేను సహాయం చేస్తానని అమెరికా ఆయుధాలను పంపుతూ తెర వెనక నుండి అమెరికా సైన్యాన్ని పంపి రష్యా దేశాన్ని రెచ్చగొడుతూ దేశాల మధ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నదన్నారు. అమెరికా ఆయుధాలను అమ్ముకోవడం కోసం శాంతియుతంగా ఉన్న దేశాల మధ్యచిచ్చు పెడుతూ, మరోవైపు శాంతి కొరకు ప్రయత్నం చేస్తున్నామని మోసపూరిత మాటలు మాట్లాడుతున్నదన్నారు. అమెరికా ఆడుతున్న నాటకంలో నరేంద్రమోడీ ప్రభుత్వం కూడా భాగస్వామిగా చేరిందన్నారు. రష్యా చుట్టుపక్కల ఉన్న దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటూ రష్యాను ఒంటరి చేయాలని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, తదితర సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. రష్యా పక్కనే ఉన్న ఉక్రెయిన్ ను నాటో కూటమి గ్రూపులో చేర్చుకోవడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. సోషలిస్టు చైనా తనను మించిపోయి ఒక బలమైన దేశంగా మారుతుండడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతున్నదన్నారు. చైనాను ఒంటరి పాటు చేయడానికి అమెరికా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఈ ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం భాగస్వామిగా ఉండటాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. చైనా,ఇండియా ఇద్దరూ చేతులు కలిపితే మన దేశానికి ఎక్కువ లాభం అని తెలిసినా మోడీ ప్రభుత్వం అమెరికాతో చేతులు కలిపి దేశానికి నష్టం చేస్తుందన్నారు. సోషలిస్టు క్యూబాను అమెరికా గత 60 సంవత్సరాల నుండి ఆర్థికంగా దివాళా తీయించే ప్రయత్నం చేస్తుందన్నారు. క్యూబా తనకు కావలసిన ఆహారం మందులు తదితర నిత్యవసర సరుకులను ఇతర దేశాలనుండి దిగుమతిచేసుకోకుండా అమెరికా ఆంక్షలు విధించిందన్నారు. చిన్నపిల్లల మరణాలు అతి తక్కువగా ఉన్న దేశాల్లో క్యూబా ఒకటి, కానీ ఇప్పుడు అమెరికా ఆంక్షలతో అక్కడ మరణాలు పెరుగుతున్నాయన్నారు. మానవత్వం లేని అమెరికా చర్యలను కార్మిక వర్గం వ్యతిరేకించాలన్నారు. యుద్ధాలు వద్దు శాంతి ముద్దు అనేది కార్మిక వర్గానికి ప్రజలకు తెలియజేసి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని కార్మిక వర్గం చైతన్యం కావాలని కోరారు. సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు కె.సుధాకరప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఖాజాబాషా, నగర నాయకులు జి.ఏసు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ , కర్ణా, జయన్న, శివకృష్ణ,వేర్ హౌస్ హమాలీ యూనియన్ నాయకులు మునేంద్ర, సుధాకర్, ఆర్‌టిసి స్వీపర్స్ యూనియన్ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు. ఓల్డ్‌సిటీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు పి.నిర్మల

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు గౌస్ దేశాయ్

యువతకు ఉపాధి చూపడంలో పాలకులు విఫలం

డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు గౌస్ దేశాయ్

ఓల్డ్ సిటీ నూతన కమిటీ ఎన్నిక, అధ్యక్ష కార్యదర్శులుగా నాయుడు, అంజి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

యువతకు ఉపాధి చూపడంలో పాలకులు విఫలమయ్యారని డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్ అన్నారు. డివైఎఫ్ఐ కర్నూలు ఓల్డ్ సిటీ జనరల్ బాడీ సమావేశాన్ని కార్మిక కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ అందరికీ విద్య ఉపాధి కావాలంటూ 1980వ సంవత్సరం పంజాబ్ రాష్ట్రం లుధియానా నగరంలో డివైఎఫ్ఐని ఏర్పాటు చేశామని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు అవిశ్రాంతంగా విద్యా ఉపాధి కోసం యువతి యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఏ దేశానికి లేనంత యువత మానవ వనరులు ఉన్నప్పటికీ యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. యువతను నిరుద్యోగం, డ్రగ్స్, మత్తు, పేదరికం, మొబైల్ అడిక్షన్ ఒక భూతం లాగా పట్టిపీడిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం యువత నైపుణ్యాన్ని పెంపొందించడం, అందరికీ ఉపాధి కల్పించడం ద్వారా యువశక్తిని ఉపయోగించి భారతదేశాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వాలను కోరారు.

అనంతరం డివైఎఫ్ఐ ఓల్డ్ సిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓల్డ్‌సిటీ అధ్యక్ష కార్యదర్శులుగా నాయుడు అంజి ఉపాధ్యక్షులుగా షేక్‌ఆమ్మద్ మణికంఠ అమర్‌సహాయ కార్యదర్శి చంద్ర వీరితోపాటు 24 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప ప్రసంగించారు.

సంక్షేమ హాస్టళ్ల భవనాల భద్రతపై ఆరా

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని గురుకుల, మోడల్, మోడల్ వసతి, ఎస్‌సి, బిసి హాస్టళ్ళ వంటివి భద్రత పై రెవిన్యూ శాఖ తహశీల్దార్ విజయ శ్రీ ఆదేశాల మేరకు విఆర్‌ఓ శేఖర్, సిబ్బంది ఆదివారం ఆరా తీశారు. తరచూ కురుస్తున్న వర్షాలకు, తుఫాన్ చినుకులకు తడుస్తున్న భవనాలు కూలెందుకు వీలుగా ఉన్నాయో లేదోనని పిన్సపల్స్‌ను అడిగితెలుసుకున్నారు. భద్రత లేని భవనాల్లో, గదుల్లో విద్యార్థులను తక్షణమే ఖాళీ చేయించి భద్రంగా ఉన్న గదులలోకి తరలించారు. ఏది ఏమైనా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఊపిరితిత్తుల సమస్యలకు సరికొత్త చికిత్సలు

అందుబాటులో ఆధునిక వైద్య విధానాలు, కొత్త మందులు

కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో లంగ్స్ టాక్ సదస్సు

రాయలసీమ జిల్లాల నుంచి పలువురు వైద్యుల హాజరు

పీజీ విద్యార్థులు, కొత్త వైద్యులకు అనుభవపూర్వక శిక్షణ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కిమ్స్ ఆస్పత్రిలో లంగ్స్ టాక్ సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

ఊపిరితిత్తుల సమస్యలు చిన్న వయసు వారి నుంచి పెద్దవారి వరకు ఎవరికైనా రావచ్చని, సాధారణ ఆస్థమా నుంచి టీబీ, సిఒపిడి లాంటి అనేక రకాల సమస్యలు వీటిలో ఉంటాయని ప్రముఖ వైద్యులు అన్నారు. కర్నూలు కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో లంగ్స్‌టాక్ అంశంపై ఒక రోజు కంటిన్యువస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ కొండాపూర్ కిమ్స్, కర్నూలు కిమ్స్ ఆస్పత్రుల సంయుక్త సహకారంతో కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. వివిధ రకాల ఊపిరితిత్తుల సమస్యలకు సంబంధించి కొత్తగా వస్తున్న చికిత్స పద్ధతులు, అత్యాధునిక వైద్య విధానాలు, సరికొత్తగా వస్తున్న మందులు, వాటితో రోగులకు ఎలా ఊరట లభిస్తుందన్న విషయాలను ప్రధానంగా ఈ సదస్సులో చర్చించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా కర్నూలు కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ జి.సుధాకర్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలుగా కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ శుభకర్ నాదెళ్ల, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలుగా కర్నూలు కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్టు డాక్టర్ వెంకట చలమయ్య, కర్నూలు కిమ్స్ డాక్టర్ సవీర, అనంతపురం ఆస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్ వ్యవహరించారు. కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం, బళ్లారి, రాయచూరు, హైదరాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి పలువురు వైద్య నిపుణులు హాజరై జూనియర్ వైద్యులు, పీజీ విద్యార్థులకు పలు రకాల చికిత్సా పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. సుమారు 150 మంది జూనియర్ వైద్యులు, పీజీ విద్యార్థులు ఈ సదస్సుకు వచ్చి కొత్త విషయాలు నేర్చుకున్నారు. ఈ సదస్సులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ కె.రామచంద్రనాయుడు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.వెంకట్ రమణ, ట్రెజరర్ డాక్టర్ కె.మాధవి శ్యామల, కర్నూలు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్ భాస్కర్, డాక్టర్ జి.శారదా పాల్గొన్నారు. ఈ సదస్సును ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని కిమ్స్ కర్నూలు సిఒఒ డాక్టర్ సునీల్ తెలిపారు. వక్తలు మాట్లాడుతూ చిన్న వయసు నుంచి కొంతమందికి వచ్చే ఆస్థమా నివారణకు గతంలో వాడే మందులు ఇప్పుడు అస్సలు ఉపయోగంలో లేవని.. కొత్తగా వస్తున్న మందులు సమర్థంగా పనిచేస్తున్నందున వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. టిబి గుర్తింపు, దానికి సత్వర చికిత్స, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సిఒపిడి) లాంటి సమస్యలకు అందించే చికిత్స తదితర విషయాలను వివరించారు. టిబి రాకుండా కొన్ని రకాల టీకాలు వస్తున్నాయని వాటి గురించి తెలిపారు. ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కొపీ, రిజిడ్ బ్రాంకోస్కొపీ, థొరాకోస్కొపీ, సెమీ రిజిడ్ థొరాకోస్కొపీ లాంటి వైద్య విధానాలు, వాటిలో ఉపయోగించే అత్యాధునిక పరికరాలు, వాటిని వాడే విధానం, వాటివల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. పెద్దపెద్ద నగరాల్లోఇవన్నీ ఇప్పటికే ఉపయోగంలోఉన్నా, ద్వితీయశ్రేణి నగరాల్లో మాత్రం ఇంకా వీటిని ఉపయోగించడంలో నైపుణ్యం అందరికీ రావట్లేదని. ఇలాంటి సిఎంఇ సదస్సులతో అత్యాధునిక పరికరాల ఉపయోగం గురించి తెలుసుకుంటే ఈప్రాంతంలో ఉన్న రోగులకు మంచి చికిత్సలు అందించ వ్చున్నారు. కొత్త పరికరాలను ఉపయోగించే పద్ధతి, ప్రొసీజరల్ శిక్షణ మధ్యాహ్నం ఇచ్చారు.

గుడ్లవల్లేరు ఘటనలపై సమగ్ర విచారణ చేయాలి

రేప్ కేసు నుండి సజ్జన్ జిందాల్‌ను రక్షించిన ఐపిఎస్‌లను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఘటనలపై సమగ్రమైన విచారణ చేయాలని ,రేప్‌కేసు నుండి సజ్జన్ జిందాల్‌ను రక్షించడానికి ముంబై నటి జత్వానీ ఆమె కుటుంబాన్ని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించిన ఐపిఎస్‌లను సస్పెండ్ చేయాలని , ఈ నిర్బంధంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సుందరయ్య జంక్షన్‌లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిరసన తెలిపారు. డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు నగేష్, అబ్దుల్లా మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల హిడేన్ కెమెరాల ఘటనపై నిష్పక్షపాత విచారణ చేసి ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్.జగన్ ప్రభుత్వం ఒక అత్యాచార ఘటనలో బడా పారిశ్రామిక వేత్త సజ్జన్ జిందాల్ ముంబై నటి జత్వానీ పై అత్యాచారం చేస్తే రేప్ కేసును ఉపసంహరించుకోవడానికి నటి జత్వానిపై నిర్బంధాన్ని ప్రయోగించి దుర్మార్గంగా వ్యవహరించారని తెలిపారు. కృష్ణా జిల్లా వైసిపి నాయకుడు ఆమెపైన అక్రమంగా ఫోర్జరీ కేసు నమోదు చేసి కేసు పెట్టిన వెంటనే ఆగమేఘాల మీద ముంబైకి ఫ్లైట్లో వెళ్లి ఆమెను ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేసి, ఆమెకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డివైసెస్ అన్నింటిని సీజ్ చేశారన్నారు. ఆమె బ్యాంక్ అకౌంట్లు అన్నింటిని ఫ్రీజ్ చేసి భారీగా నిర్బంధం చేసి ఆమె చేత హత్యాచార కేసును ఉపసంహరించుకోమని భారీగా ఒత్తిడి చేశారని తెలిపారు. దిక్కుతోచని పరిస్థితిలో వైట్ పేపర్‌పైన సంతకాలు చేస్తే విడుదల చేయిస్తాం అని పోలీస్ అధికారులు చెప్పడంతో బెయిలు యిప్పించి విడుదల చేశారన్నారు. ఈ ఘటనలో ఇన్వాల్వ్ అయిన ఇతర అధికారులను రాజకీయ నాయకులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్ ,సాయి, ఉదయ్ నగర ఉపాధ్యక్షులు అబుబాకర్, డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష, ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నాయుడు, అంజి నాయకులు షేక్ అహ్మద్, చంద్ర, జుబేర్ ,ఖలీల్, గౌస్ బాషా, డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు రామకష్ణ, మాజీ నాయకులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నిరసనుద్దేశించి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

నేడు విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి వర్షాలు కారణంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష ఆదేశాలను జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలవారికి సెలవు ప్రకటించడమైనదిన్నారు.

జూనియర్ కళాశాలలకు కూడా

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అధిక వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ అధిక వర్షాలపై రెవెన్యూ వ్యవసాయ ఇతర శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అంటువ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రెవెన్యూ పంచాయతీరాజ్ ఇతర అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశించారు. విద్యా సంస్థలకు కూడా సెలవు ప్రకటించాలని పేర్కొన్నారు.

100 మంది జనసైనికుల రక్తదానం

పలుసామాజిక సేవాకార్యక్రమాలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం ఈనెల 2ను పురస్కరించుకుని గత మూడు రోజులుగా రాయలసీమ కన్వీనర్‌పవన్ కుమార్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటడం, ప్రత్యేక పూజలు, అన్నదానం, ఇలా ప్రతి రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం పవన్ కుమార్ ఆధ్వర్యంలో జనసేనా రాష్ట్ర ప్రచారకర్త కరుణాకర్ సారథ్యంలో నగరంలోని ఉడ్‌ల్యాండ్ హోటల్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 100 మంది దాకా రక్తదానం చేశారు. పవన్ కుమార్ మాట్లాడుతూ జననేత జనసేనాని పవన్ కళ్యాణ్ నిరంతరం ప్రజల అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్నారన్నారు. సోమవారం మరిన్ని సేవకార్యక్రమాలు నిర్వహిస్తామ తెలిపారు. జనసేనా నాయకులు రాజేష్, సతీష్, అనిల్, వర్ధన్, మౌలాలి, సాయి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీ జలమయం

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలోని వైయస్సార్ కాలనీ జలమయమైంది. గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు ఇళ్లలో చేరుతున్నాయి. ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో కాలనీ వాసుల ఇంటి ముందు చెరువును తలపిస్తున్నాయి. రోడ్డు వేయకపోవడంతో ముళ్ళ కంపలతో దారులు మూసుకుపోతున్నాయి. దీంతో ఒకవైపు దోమలు, మరోవైపు పాములు ఎక్కువవ్వడంతో భయంభ్రాంతులతో జీవనం కొనసాగిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో చిమ్మ చీకట్లో వస్తున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న కాలనీలో ఇలాంటి పరిస్థితులు ఉంటే మారుమూల గ్రామాల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ కాలనీలో సుమారు 200 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. ఇళ్లలో నుండి బయటకు రావాలంటే బురదలో దిగాల్సిందే. వృద్ధుల పరిస్థితి దారుణంగానుంది. పాఠశాలలకు పిల్లలు వెళ్లాలన్నా బురదలో వెళ్లల్సిన దుస్థితి తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వైయస్సార్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

నాయకులు, అధికారులు సందర్శించండి : నజీర్, వైఎస్ఆర్ కాలనీ వాసి

నాయకులు, అధికారులు వైయస్సార్ కాలనీని ఒక్కసారి సందర్శించి మా సమస్యలు చూడాలి. సమస్యలను ఎన్నికలప్పటి నుండి అందరికీ చెబుతున్నా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు. చీకటి పడితే ఏ పాము ఎటువైపు నుండి వస్తుందో తెలియక భయం భయంతో జీవిస్తున్నాం. కనీసం గ్రావెల్ రోడ్డు వేసి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు వెలిగేల చూడాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న వేరుశనగ పంట

- పరిశీలించిన జాయింట్ కలెక్టర్
-క్రాప్ ఇన్సూరెన్స్ అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వేరుశనగ పీకి కోత కోసం ఆరబెట్టిన పంట మొత్తం తడిసి నల్లగా మారి వేరుశనగ కాయలు మొలకెత్తాయి. ఆదివారం గోనెగండ్ల, గంజిహళ్లి గ్రామాల పరిధిలో పొలాల్లో దెబ్బ తిన్న పంటలను జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించి రైతులను అడిగి నష్టం వివరాలను తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ వేరుశనగ పంటను పీకి కోత కోసం ఆరబెట్టామని, సరైన సమయంలో కూలీలు దొరకకపోవడం, మరోవక్క వేరుశనగ కోతను ఆడించే మిషన్లు తగినన్ని అందు బాటులో లేకపోవడంతో గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నల్లగా అయి పోయి వేరుశనగ కాయలు మొలకెత్తి నష్టం కలి గిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. జెసి నవ్య మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి వర్షాలకు తడిసి పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ అందేలా తగిన చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి సబ్సిడీ కింద తగినన్ని మిషన్లు అందజేయడంతోపాటు వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ విశ్వనాథ్ ఎమ్మిగనూరు ఏడిఏ ఖాద్రి, గోనెగండ్ల ఏవో హేమలత, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ పంటను జాయింట్ కలెక్టర్ నవ్యకు చూపుతున్న రైతులు

ఎంఇఓలను సస్పెండ్ చేయాలి : యుటిఎఫ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

నిబంధనలకు విరుద్ధంగా పని సర్దుబాటు చేసిన మండలవిద్యాధికారులు ఆంజనేయులు, మధుసూదన్‌లను సస్పెండ్ చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు యస్.దావీదు, జిల్లా కార్యదర్శి దేవపాల్ రాష్ట్ర కౌన్సిలర్ జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మిగనూరులోని ప్రాంతీయ కార్యాలయంలో శాఖ అధ్యక్షుడు యం.రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్‌లో సర్ ప్లస్ అయిన గణిత ఉపాధ్యాయుడు పి.ప్రకాష్‌ను ఆయన విల్లింగ్ తీసుకోకుండా ఏకపక్షంగా మండల విద్యాధికారులే సంతెనాగలాపురం కేటాయిస్తూ జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మండల విద్యాధికారి ఆంజనేయులు కౌన్సిలింగ్ జరిగిన రోజు సెలవులో వున్నారని, సదరు ఉపాధ్యాయుడు కౌన్సిలింగ్ హాజరు కాలేదని డీఈఓకి రిపోర్టు ఏలా ఇస్తారని ప్రశ్నించారు. ఎంఈఓ -2 మధుసూదన్ సదరు ఉపాధ్యాయునికి సమాచారం ఇవ్వకుండా 3:30 గంటకే సంతెనాగలాపురం కేటాయిస్తూ ఆర్డర్ డ్రైవ్ చేయించి డీఈవోకి రిపోర్టు పంపడం వెనక ఇబ్బందులకు గురిచేయడమేనని తెలిపారు. ఉపాధ్యాయులను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్న మండల విద్యాధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మల్లారి నాగరాజు, యం.సుధాకర్, సంపత్ కుమార్, మాదన్న కె.నాగరాజు, చిన్న ఎల్లప్ప, దేవేంద్రబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ముంపు పొలాలను పరిశీలించిన ఆర్డిఒ

రైతుల తో మాట్లాడుతున్న ఆర్డిఒ రామలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం నంచర్ల గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి జయలక్ష్మి ఆధ్వర్యంలో పత్తికొండ ఆర్డిఒ రామలక్ష్మి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దని, నష్టపోయిన వారిని గుర్తించి తగిన నివేదికలను ఉన్నత అధికారులకు, ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. విఆర్ఒ రంగన్న, నంచర్ల గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డిఒ కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను పరిశీలించి బాధ్యతాయుతంగా పని చేయాలని సిబ్బందిని హెచ్చరించారు.

దంచి కొట్టిన వర్షం

-లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - ఆదోని

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అవదూడ వంక, రంజల వంక, జైహింద్ వంక నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాటికి ఆనుకొని ఉన్న బుడేకల్, బోయగేరి, ఆర్టీసీ కాలనీ, శివ శంకర్ నగర్ ప్రాంతాలలో నీరు ఇళ్ళ మధ్యలో చేరింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణం, తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణంలో వర్షపు నీరు చేరడంతో అక్కడికి వచ్చిన వారు మురుగునీటిలోనే నడుచుకుంటూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షం వచ్చిన ఆదోనిలో మున్సిపల్ మెయిన్ రోడ్డు శ్రీనివాస భవన్ సర్కిల్, జైన్ టెంపుల్ వద్ద మురుగు కాలువలు పొంగిపొర్లి రోడ్డుపై మురుగునీరు నిలుస్తోంది. రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మురుగు కాలువలపై కట్టడాలు యదేచ్ఛగా కొనసాగుతుండడంతో నీరు ముందుకు పారెందుకు అవకాశం లేక రోడ్డుపైకి పొంగిపొర్లుతుందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది మురుగు కాలువల్లో పూడిక తీసేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు

అయినప్పటికీ సమస్య యధావిధిగానే ఉండడం పట్ల పరిష్కారానికి మార్గమే లేదా అంటూ అధికారులు తీరుపై పురవాసులు విమర్శలు గుప్పిస్తున్నారు.

వర్షపాతం వివరాలు ఇలా..

ఆదోని డివిజన్‌లో ఆదోని 1.6 మిల్లీమీటర్లు, పెద్దకడుబూరు 1.2, ఎమ్మిగనూరు 2.2, నందవరం 0.8, గోనెగండ్ల 1.4, మంత్రాలయం 1.4, కౌతాళం 0.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రోడ్లు చిత్తడిగా మారి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో నీరుచేరి జనజీవనం అస్తవ్యస్థంగా మారింది.

రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ లో రైతులు తీసుకొచ్చిన వేరుశనగ తడిసిపోవడంతో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్ రెడ్డి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ పద్మావతితో చర్చించారు. యార్డులో కూరగాయలు హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారస్తులు వల్ల ఇబ్బంది ఉందని కమిషన్ ఏజెంట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి మార్కెట్ యార్డ్ మొత్తం తిరిగి ఎక్కడ సమస్యలు ఉన్నాయో ఎక్కడ షెడ్లు అవసరమో అన్ని తెలుసుకొని, అదేవిధంగా పత్తి మార్కెట్ కూడా కొనసాగించాలని సెక్రెటరీ పద్మావతికి సూచించారు.

తడిసిన వేరుశనగను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి

సిఎంకు అండగా నిలుద్దాం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబుకు అండగా నిలుద్దామని టిడిపి ఆదోని నియోజకవర్గం మాజీ ఇన్చార్జి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సిఎంగా చంద్రబాబు 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చే దిశగా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు.

గణేష్ విగ్రహప్రతిష్టాపనకు విరాళం : అనంతరం ఆదోనిలోని 19వ వార్డు లక్ష్మణ్ నగర్‌లో గణేష్ విగ్రహ ప్రతిష్టాపనకు రూ.9,500, పూజా కార్యక్రమాలకు రూ.వెయ్యి నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌ఛాఇర్జీ ఆది గుడిసె కృష్ణమ్మ

కేక్ కట్ చేసిన గుడిసె ఆది కృష్ణమ్మ

విరాళంగా అందించినట్లు టిడిపి నాయకులు బోయ శేఖర్, బోయ రంగన్న, శెట్టి బలిజ, రఘు, భాస్కర్ రెడ్డి, యాదవ్ తిమ్మ ఆదివారం విలేకరులకు తెలిపారు. లక్ష్మణ్ నగర్‌లో మహిళలు మరుగుదొడ్డు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని ఆమె దష్టికి తీసుకెళ్లడంతో త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. విరాళం ఇవ్వడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే వైసిపి ఆఫీసు డ్రామా

- మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎమ్మెల్యే పార్థసారథి వైసీపీ కార్యాలయం డ్రామా తెరపైకి తీసుకురావడం సిగ్గుచేటని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి, ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ నూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఆదోనిలోని ఎంహెచ్‌పిఎస్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బయటపడిన ఒక ఆడియో కాల్ రికార్డింగ్‌లో తాజాగా వైసీపీ నుంచి బిజెపిలో చేరిన వెల్లాల మధు సూధన శర్మ అనే నాయకుడు ఒక యూట్యూబ్ రిపోర్టర్‌తో మాట్లాడుతూ ఆదోనిలో బిజెపి పార్టీ ఏ విధంగా ఎమ్మెల్యే వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి ఒక అంశం చుట్టూ ప్రజల దృష్టి కేంద్రీకతం అయ్యేలా కుట్రలు చేస్తున్నదో పూస గుచ్చినట్లు మాట్లాడిన వాయిస్ రికార్డింగ్ హల్చల్ అయిందని వివరించారన్నారు. ఇలా నెలకొక డ్రామాతో ఐదేళ్లు గడిపేయాలనే కుట్రలో ఎమ్మెల్యే పార్థసారథి ఉన్నట్లు స్పష్టమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదోని ప్రజలపై దయ ఉంచి పార్థసారథి డ్రామాలు అరికట్టి దగా పడిన ఆదోనిని అభివృద్ధి చేయాలని కోరారు. ఆదోని మండలం సంతే కుడ్లూరు గ్రామంలో పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో ఎంహెచ్‌పిఎస్ పోటీ చేయాలని నిర్ణయించిందన్నారు. సమావేశంలో నాయకులు వసీమ్, సాహెబ్, రామలింగ, కుబేర స్వామి, సంతే కుడ్లూరు ఎంహెచ్‌పిఎస్ గ్రామ ప్రెసిడెంట్ సద్దాం హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో యాజమాన్యం పరిరక్షణ లోపం దీనికి ప్రధాన కారణమని విమర్శించారు. ఇది విద్యార్థినుల మానప్రాణాలకే ప్రమాదమన్నారు. ఉన్నత చదువుల కోసం కళాశాలకు వస్తున్న విద్యార్థుల నుండి ఫీజులు వసూలు తప్ప రక్షణ గురించి ఆలోచించకుండా యాజమాన్యం వ్యవహరించిందని విమర్శించారు. వీడియోలు రికార్డింగ్ చేశారన్న అనుమానాలు కూడా విద్యార్థినుల లేవనెత్తారని, వాటిపై సమగ్ర దర్యాప్తుని చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయాన్ని బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటన్నారు. వెంటనే ఘటనపై ఉన్నత స్థాయి కమిటి వేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు కళాశాలలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కళాశాల్లో, రాజకీయ అండదండలు ఉన్నాయన్న విమర్శలు కూడా వస్తున్న నేపథ్యంలో ఎంతటి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గణేష్ ఉత్సవాల అనుమతులకు ప్రత్యేక పోర్టల్

ప్రజాశక్తి - ఆలూరు

గణేష్ ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులకు అనుమతి కోసం ప్రత్యేక పోర్టల్‌ను ప్రవేశ పెట్టినట్లు ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు ఆదివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాల అనుమతుల కోసం సులభంగా పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతులు పొందవచ్చున్నారు. https://ganeshutsav.net వెబ్ సైట్‌లో అనుమతుల ప్రక్రియ ఉందన్నారు. 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే చాలు ఎన్ఒసి పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం మీ వాట్సాప్ కు వస్తుందన్నారు. ఈ విధానంతో ప్రజలు సులభతరంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనంకు మీ–సేవలో చలాన రుసుంను చెల్లించి, నిరభ్యంతర పత్రం, క్యూ ఆర్ కోడ్‌ను పొందవచ్చున్నారు.

శ్రీ మఠంలో అన్నదానానికి రూ. 2 లక్షలు విరాళం

ప్రజాశక్తి మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న అన్నదానానికి భక్తుల నుంచి రూ. 2 లక్షల విరాళం వచ్చినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రికి చెందిన జాగీర్దార్



భీమసేనరావు దర్శన అనంతరం శ్రీ మఠం అన్నదానానికి రూ. 2 లక్షలు విరాళంగా అందించారన్నారు. దాతకు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారని చెప్పారు.

రాజకీయ రంగంలో ముస్లింలకు రిజర్వేషన్‌తో న్యాయం

ఎపి రాష్ట్ర ముతవల్లీల అసోసియేషన్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

రాజకీయ రంగంలో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించినప్పుడే న్యాయం జరుగుతుందని ఎపి రాష్ట్ర ముతవల్లిల అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ షఫీ అన్నారు. ఆదివారం కర్నూలులో రాష్ట్ర ముతవల్లీల సమావేశం – వక్ఫ్ బిల్లు , ఇతర సమస్యలపై కర్నూలు నగరంలోని జిబి. దర్గాలో రాష్ట్ర ముతవల్లీల సమావేశం ఎపి ముతవల్లీల అసోషియేషన్ అధ్యక్షులు షకీల్‌షఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర చ జిల్లా ముతవల్లీలు , మ్యానేజింగ్ కమిటీ వారు పాల్గొన్నారు. షకీల్ షఫీ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డును బలోపేతం చేయాలంటే రాజకీయ రంగంలో కూడా ముస్లింలకు ఎంపిలు, బార్‌కౌన్సిల్ మెంబర్లు, ఎమ్మెల్యేలు, ఇతర రంగాల్లో కూడా రిజర్వేషన్ కల్పించినప్పుడే వక్ఫ్ బోర్డులో చట్టం ప్రకారం అందరు సభ్యులకు న్యాయం జరుగుతుందన్నారు. వక్ఫ్ బోర్డు ముతవల్లీల సమస్యల పై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి వారి సమస్యలకు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం సత్వరమే వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఇప్పుడు వస్తున్న వక్ఫ్ బిల్లులో ముస్లిమేతరులను తీసుకోవాలని చెబుతున్నారని, దానికి గల కారణాలు తెలపాలన్నారు. ఎందుకంటే దేవాదాయ శాఖ, క్రిస్టియన్ శాఖల్లో ముస్లిం సభ్యులు ఉండకూడదనే, అలాంటిది ముస్లింలకు చెందిన వారి వక్ఫ్‌బోర్డులో వారిని ఎందుకు తీసుకోవాలనుకున్నారో తెలపాలని ప్రశ్నించారు. మొదటికే వక్ఫ్ ఆస్తుల విషయంలో రెవిన్యూ డిపార్టుమెంట్ వారి తోనే కోర్టుల్లో కేసులు ఉంటాయి. అలాంటిది వక్ఫ్‌ఆస్తుల పై జిల్లా కలెక్టర్లకు అధికారాలు ఇస్తే వక్ఫ్ భూములు ఎంత వరకు సేఫ్‌గా ఉంటాయని వారు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమూద్ పీర్, రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రి, జిబి మసీద్ అథర్ పాషా, సయ్యద్ నూరుల్లా ఖాద్రి, వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరమ్ షైక్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ను ప్రారంభిస్తున్న నాయకులు

దినసరి టమోటా, కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని ఏర్పాటు చేసిన దినసరి టమోటా, కూరగాయల మార్కెట్‌ను నూతన కాంట్రాక్టు లక్ష్మీనారాయణ, జడ్పిటిసి దొరబాబు, ఆలూరు బీజేపీ ఇన్చార్జి వెంకట రాముడులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చే రైతులు, వ్యాపారస్తులు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోజు సాయంత్రం 3 గంటలకే సవాలు పెడతామన్నారు. సకాలంలో రైతులు ఇంటికి చేరుకుంటారని, అలాగే వ్యాపారస్తులు కూడా హైదరాబాదు, బళ్లారి వంటి ప్రాంతాలకు సకాలంలో మీట్ అవడానికి అనుగుణంగా ఉంటుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, నరసింహులు, రామక్రిష్ణ, నరసప్ప, రాజు, సతీష్, మహేష్, ప్రకాష్, తిమ్మప్ప, క్రిష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి అన్ని దేశాలు సహకరించాలి : సిఐటియు

ప్రజాశక్తి : ఎమ్మిగనూరు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ క్రూరమైన యుద్ధాలను తక్షణమే ఆపాలని, ప్రపంచ శాంతిని కల్పించాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సి గోవిందు, బి రాముడు పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకొని పాలసీనపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక కర్షక నాయకులు ఏం అబ్దుల్లా, యు రమేష్, అహ్మద్, రంగస్వామి, మునీంద్ర, ఇస్మాయిల్, రాజు, భాస్కర్, మహాలింగప్ప, మున్నా తదితరులు పాల్గొన్నారు.

సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

వడ్డెర్లకు ఇచ్చిన హామీని బాబు, పవన్ నిలుపు కోవాలి

- వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేష్ మౌర్య

ప్రజాశక్తి - మంత్రాలయం

అన్ని విధాలుగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వెంకటేష్ మౌర్య కోరారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన ఆయన బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు వడ్డే నారాయణతో కలసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వడ్డెర్లు సుమారు 40 లక్షల మంది ఉన్నారని దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్లు కొట్టడం, భవన నిర్మాణ కార్మికులుగా మట్టి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చారిత్రక కట్టడాలు నిర్మించిన ఘనత వడ్డెర్లదే అని చెప్పారు. సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట ఇచ్చారని తెలిపారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చంద్రబాబు మళ్ళీ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై సానుకూలంగా స్పందించారన్నారు. రాజకీయ పార్టీలకు, గ్రూపులకు అతీతంగా ఎస్టీ సాధన కోసం కలసి కృషి చేయాలని కోరారు. జాప్యం చేయకుండా ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఎస్పందించి అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం పార్లమెంటు కు సిఫారస్ చేయాలని కోరారు.

రాజగోపురం నిర్మాణానికి లక్ష విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కోసం రూ.1,01,116 విరాళం ఇచ్చినట్లు సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదోని వాస్తవ్యులైన కమలాపురం మంజులదేవి, మోహనకృష్ణ ఈ విరాళాన్ని అందించారన్నారు. అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాము, లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి, బాండు పేపర్, పూలమాలతో సత్కరించామన్నారు.